క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

డిండి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సుల్లో చేరేందుకు గాను ఆసక్తి గల విద్యార్థులు జూన్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భయ్యు మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోప, డ్రాట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ ట్రేడ్‌లలో మొదటి విడత సీట్ల భర్తీకి ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై, 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441237136 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సీఐ, ఎస్‌ఐకి సన్మానం



సీఐ బీసన్న, ఎస్‌ఐ సురేష్‌ను సన్మానిస్తున్న కృష్ణా స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు

నాగార్జునసాగర్: ఇటీవల బదిలీపై వచ్చి విధుల్లో చేరిన సాగర్ సర్కిల్ సీఐ బీసన్న, విజయపురిటౌన్ ఎస్‌ఐ సురేష్‌ను నందికొండ మున్సిపాలిటీ పరిధి పైలాన్ కాలనీలోని కృష్ణా స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు అలీబాబా, కార్యదర్శి తాజొద్దీన్, శ్రీనివాస్, జీవీఆర్, లక్ష్మణ్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వర్లు

గుర్రంపోడు: మండలంలోని చేపూరు గ్రామానికి చెందిన కొమ్ము సహదేవ్ ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు బుధవారం పరామర్శించి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వలిశెట్టి మధు, జక్కల భాస్కర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి, గిరిబాబు, నడ్డి శంకర్, మారపాక నరేందర్, భాషపాక యాదయ్య, శ్రీను, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

దేవరకొండ: దేవరకొండ ఆర్టీసీ డిపో పరిధిలోని బస్ స్టేషన్లలో తినుబండారాలు, వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం దేవరకొండ డిపో కార్యాలయంలో వ్యాపారస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్టాండ్లలోని స్టాళ్లలో ఎమ్మార్పీ ధరలకే వస్తువులను విక్రయించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిపో కార్యాలయ సిబ్బంది, స్టాళ్ల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన

నిడమనూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగుపై, వేసవిలో రైతులు చేపట్టాల్సిన వ్యవసాయ పనులపై కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు బుధవారం మండలంలోని వేంపాడ్‌లో రైతులకు అవగాహన కల్పించారు. వానాకాలం అనువర్తిత పరికరాలు, సాగు వివరాలు, నేరుగా విత్తే పద్ధతుల గురించి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు రైతులకు వివరించారు. మరో శాస్త్రవేత్త చంద్రశేఖర్ మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ఆవశ్యకత, వేసవి దుక్కుల ప్రయోజనాలు గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రవేత్త పల్లవి పాల్గొని వాతావరణ పరిస్థితులు, పంటలకు సంబంధించిన వివరాలను తెలియజేసే యాప్‌ల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాసరావు, మల్లేష్, సుఖేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నాయకులు

గుర్రంపోడు: మండలంలోని వద్దిరెడ్డిగూడెం గ్రామంలో రామాలయ నిర్మాణానికి గాను జెడ్పీటీసీ సభ్యురాలు గాలి సరితారవికుమార్ బుధవారం రూ.1,00,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ నాయకుడు జాల యాదయ్య రూ.10వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ సైదులు గౌడ్, వద్దిరెడ్డి నర్సింహారెడ్డి, మేకల కోటిరెడ్డి, వద్దిరెడ్డి యాదగిరిరెడ్డి, రామాంజనుజయరెడ్డి, వద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి, మేకల నాగిరెడ్డి, చందా గోవిందరెడ్డి, సురేష్‌రెడ్డి, వద్దిరెడ్డి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- వేరే చోట ఇన్‌చార్జిలుగా మిర్యాలగూడ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు
- అర్జీల పరిశీలనకు తప్పని ఇబ్బందులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగాన్ని సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్ లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు గాను 2020లో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్)ను ప్రవేశపెట్టగా, మూడేళ్ల తర్వాత ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి ప్లాట్లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో అసలే సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న టౌన్ ప్లానింగ్ విభాగానికి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సవాల్‌గా మారింది.

ఇతర మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిలుగా..

మిర్యాలగూడ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులను ఉన్నతాధికారులు ఇతర మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఈ మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీఓ)



మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం

కు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్(టీపీఎస్) ఉద్యోగికి అదనంగా నందికొండ, చండూరు మున్సిపాలిటీల అదనపు బాధ్యతలు అప్పగించారు. మిర్యాలగూడ మున్సిపాలిటీకి నలుగురు టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్(టీపీబీఓ)అధికారులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరు కూడా లేరు. అదేవిధంగా నాలుగు అసిస్టెంట్, ఒక ఆపరేటర్ పోస్టు ఖాళీగానే ఉన్నాయి.

14,431 దరఖాస్తులు..

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులు ఉండగా 14,431 మంది ఎల్‌ఆర్‌ఎస్ కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీటి క్రమబద్ధీకరణతో మిర్యాలగూడ మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూరనుంది. కాగా ఇప్పటివరకు కేవలం 600కు పైగా దరఖాస్తులకు మాత్రమే అనుమతులు లభించాయి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ సమన్వయంతో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నాం. సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు తమకు ఏమైనా అనుమానాలు ఉంటే దళారుల మాటలు నమ్మకుండా, నేరుగా టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులను సంప్రదించాలి.

– రవీందర్‌సాగర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొండమల్లేపల్లి: రైస్ మిల్లు యజమానులకు సూచనలు చేస్తున్న డీసీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

కొండమల్లేపల్లి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి(డీసీఎస్‌ఓ) వెంకటేశ్వర్లు రైస్ మిల్లు యాజమాన్యాలకు సూచించారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పలు రైస్ మిల్లులను ఆయన సందర్శించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. రైస్ మిల్లు యాజమాన్యాలు నిబంధనల మేరకు నడుచుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయన వెంట డీటీసీఓ శ్రీనివాస్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేస్తాం

పెద్దఅడిశర్లపల్లి: ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేస్తామని డీసీఎస్‌ఓ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్, ఘనపురం గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఘనపురం కొనుగోలు కేంద్రంలో 10 లారీలు, అంగడిపేట ఎక్స్ రోడ్ కొనుగోలు కేంద్రంలో 5 లారీల ధాన్యంను మిల్లులకు తరలించినట్లు తెలిపారు. అనంతరం మండల పరిధిలో ఉన్న మిల్లులను పరిశీలించారు. ఆయన వెంట దేవరకొండ డీటీసీఎస్ హనుమంతుల శ్రీనివాస్‌గౌడ్, మానిటరింగ్ అధికారి అయూబ్, సీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది ప్రభాకర్, మహేష్ తదితరులున్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

నల్లగొండ టౌన్: దాచేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దామరచర్ల మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన కూలీల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గాయపడిన వారికి ఉచితంగా వైద్యం అందించాలని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

‘కంటి వెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మైనంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణలో అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుపాకుల అరుణాసురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, శ్రీనునాయక్, దీప్లానాయక్, కొర్ర గౌతమి, బొడ్డుపల్లి కృష్ణ, పులిజాల ముత్యాలు, కొర్ర గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మిర్యాలగూడ మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్‌రావు అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సంజయ్, లక్ష్మీప్రసన్న, వైద్య సిబ్బంది శ్రీవాణి, పూలమ్మ, పద్మ, పార్వతమ్మ, సరస్వతి, ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు గుత్తా రాణి, లక్ష్మి, ఆర్‌పీలు రాజేశ్వరీ, భవాని, బీఆర్‌ఎస్ పట్టణ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు అయిల వెంకన్న, మెండికత్తి లింగయ్య, మోహన్‌రావు, ఉపేంద్ర, భాను తదితరులున్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

చందంపేట: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం మండల వైద్యాధికారి చందునాయక్ పరిశీలించి మాట్లాడారు. కంటి సమస్యలతో కంటి వెలుగు కేంద్రాలకు వస్తే ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు కళ్లద్దాలు అందజేయడం, శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. పోలేపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగులో 230 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 140 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిళ్ల జంగమ్మ, మోహన్, మహేశ్, కుమార్, శరద్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ: కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మిర్యాలగూడ టౌన్: కంటి పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వర్‌రావు

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయాలని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అన్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రంగుమారి, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని కోరారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, పల్లా దేవేందర్‌రెడ్డి, బొడ్డుపల్లి వెంకటరమణ, రమావత్ అంజయ్యనాయక్, పల్లె నర్సింహ, ఎండీ.మైనొద్దీన్, పార్లపల్లి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో మహానాడు ఏర్పాట్ల పరిశీలన

మిర్యాలగూడ టౌన్: దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మిర్యాలగూడలో ఈ నెల 22న నల్లగొండ పార్లమెంట్ స్థాయి మహానాడు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల మధుసూదన్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి–నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డులో గల శ్రీమన్నారాయణ ఫంక్షన్ హాల్‌లో జరిగే మహానాడు ఏర్పాట్లను బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. ఈ మహానాడును విజయవంతం చేసేందుకు పార్టీ ముఖ్య నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నేత కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, నల్లగొండ, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పార్టీ కన్వీనర్లు ప్రభాకర్, మండవ వెంకటేశ్వర్లు, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు చిల్లంచర్ల గోపాలకృష్ణ, పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు భయ్యు నారాయణ, మిర్యాలగూడ పట్టణ, మండల పార్టీ కన్వీనర్లు వడ్డెబోయిన శ్రీనివాస్, చిలకల వెంకన్న, ఉప్పలపాటి గోపాలకృష్ణ, దామరచర్ల మండల పార్టీ కన్వీనర్ పడిగపాటి రాంరెడ్డి తదితరులున్నారు.

మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

మాడుగులపల్లి: కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని భీమనపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించి ఆయన మాట్లాడారు. మిల్లర్లు సకాలంలో ధాన్యం దిగుమతి చేసుకోని కారణంగా లారీల కొరత ఏర్పడుతోందని పేర్కొన్నారు. కొంతమంది మిల్లర్లు కావాలనే ధాన్యం దిగుమతి చేసుకోకుండా తేమ, తాలు ఇతర కారణాలతో కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బందికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షానికి కొందరి రైతుల ధాన్యం తడిసి మొలకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ అలుగుబెల్లి సుధాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, జానమ్మ, ఎల్లమ్మ, రాములు, సింగం రాములు, కృష్ణగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న సీపీఎం నాయకులు

సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

మిర్యాలగూడ అర్బన్: సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ నూకల సరళ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆలగడప పీహెచ్‌సీ వైద్యులు విద్యాశాఖ, ఐకేపీ, ఉపాధి హామీ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. ఇటీవల అకస్మాత్తుగా గుండె నొప్పితో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని, గుండె నొప్పి వచ్చిన వారికి సీపీఆర్ చేస్తే ప్రాణాలు నిలిచే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, సూపరింటెండెంట్ కరుణాకర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు



మాడుగులపల్లి: మెమొంటోలు, సర్టిఫికెట్లతో క్రీడాకారులు



తిరుమలగిరి: క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఎంపీపీ భగవాన్‌నాయక్



కొండమల్లేపల్లి: క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ దూదిపాల రేఖ

మాడుగులపల్లి: మండల కేంద్రంలోని సెవెంత్ అడ్వెంటిస్ట్ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 15 నుంచి జరుగుతున్న సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. కబడ్డీ ఫైనల్స్‌లో చెరువుపల్లి జట్టు, వాలీబాల్‌లో తోపుచర్ల జట్టు జయకేతనం ఎగురవేశాయి. 100 మీటర్ల పరుగు పందెంలో ఇందుగులకు చెందిన పి. రాకేష్, షాట్‌పుట్‌లో మాడుగులపల్లికి చెందిన కె. రవివర్మ విజయం సాధించారు. పోటీల్లో గెలిచిన జట్లకు, క్రీడాకారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోకల శ్రీవిద్యారాజు, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ రవికుమార్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌నాయక్, నర్సింహానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లోనూ రాణించాలి..

త్రిపురారం: గ్రామీణ యువత క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ అనుముల పాండమ్మ అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలు మంగమ్మ, తహసీల్దార్ కేసీ ప్రమీల, వైస్ ఎంపీపీ మట్టయ్య, ఎంపీపీ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ భిక్షంరాజ్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రమేష్, పీఈటీ ఉదయ్‌శ్రీ, శివ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలను పెంచుకోవాలి..

కొండమల్లేపల్లి: క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను పెంచుకోవాలని ఎంపీపీ దూదిపాల రేఖా అన్నారు. కొండమల్లేపల్లిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బుధవారం ఆమె ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజురెడ్డి, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రాణిరాజునాయక్, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడలతోనే నాయకత్వ లక్షణాలు..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): క్రీడలతో నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చని ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఎంపీపీ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ, తహసీల్దార్ పాండునాయక్, ఎంఎస్‌ఓ తలారి రవీందర్, పీఈటీ ఎక్కలూరి సునీత, కోఆప్షన్ సభ్యుడు షేక్ రహీం పాల్గొన్నారు.

డిండి మండలంలో..

డిండి: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిసాయి. ఈ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాబు, సర్పంచ్ మేకల సాయమ్మకాశన్న, ఎంపీటీసీలు ఏటి రాధికాకృష్ణ, బూషిపాక వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లిలో..

వేములపల్లి: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బుధవారం ఎంపీపీ పుట్టల సునీత, జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీఓ అజ్మీరా దేవిక, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, సర్పంచ్‌లు చిర్ర మల్లయ్యయాదవ్, మజ్జిగపు పద్మ, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, పీఈటీలు వెంకట్‌రెడ్డి, నాగలక్ష్మి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ: సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీపీ నూకల సరళ బహుమతులతో పాటు క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంఈఓ బాలాజీనాయక్, ఎంపీఓ వీరారెడ్డి, సూపరింటెండెంట్ కరుణాకర్, పీడీలు వెంకటరత్నం, సైదులు, వెంకటయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



త్రిపురారం: క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఎంపీపీ అనుముల పాండమ్మ



వేములపల్లి: బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ మంగమ్మ తదితరులు



మిర్యాలగూడ: విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఎంపీపీ సరళ తదితరులు

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు



పూజల్లో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తదితరులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లిలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగంధర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రూనాయక్, నేనావత్ రాంబాబు, మారం రవీందర్‌రెడ్డి, గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ మేరకు బస్సులు నడిపిస్తాం



పాల్, డీఎం

మిర్యాలగూడ టౌన్: ప్రయాణికుల రద్దీ మేరకు బస్సులను నడిపిస్తామని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. బుధవారం నిర్వహించిన మిర్యాలగూడ డిపో ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రజలు, ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల నుంచి తీసుకున్న సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

అలేఖ్యకు రూ.50వేలు ఆర్థికసాయం అందజేత



అలేఖ్యతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న నూకల వేణుగోపాల్‌రెడ్డి

నిడమనూరు: గుర్రంపోడు మండలం కొత్తలాపురం గ్రామానికి చెందిన కట్టెబోయిన అలేఖ్య నిడమనూరు ఆదర్శ పాఠశాలలో చదువుతూ ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో 9.7 జీపీఏ సాధించింది. అలేఖ్య తల్లి లక్ష్మమ్మ కేన్సర్‌తో బాధపడుతూ ఫిబ్రవరి 11న మృతిచెందింది. ఆమె తండ్రి వారిని వదిలి వెళ్లిపోయాడు. ‘పది’లో సత్తా చాటిన విద్యార్థిని, అలేఖ్యకు బాసటగా నిలుస్తాం అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనాలకు పలువురు దాతలు స్పందించి ఆమెకు ఆర్థికసాయం చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఈ మేరకు పటాన్‌చెరువు సీఐ నూకల వేణుగోపాల్‌రెడ్డి తాను చేపట్టిన వన్ చాలెంజ్ ద్వారా హైదరాబాద్‌లోని ఓ బట్టల షాపులో పనిచేస్తున్న కట్టెబోయిన అలేఖ్యను బుధవారం కలిసి రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

హాలియా: హాలియా మున్సిపాలిటీలో పనిచేస్తున్న అనుముల గ్రామానికి చెందిన ఏలేటి సైదులు, అదే గ్రామానికి చెందిన పాస్టర్ ఏబీ సుధాకర్ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి బుధవారం మృతుల నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏలేటి సైదులు, ఏబీ సుధాకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, హాలియా మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సోమశేఖర్, కౌన్సిలర్లు పిల్లి ఆంజనేయులు, తక్కెళ్లపల్లి సైదులు, నాయకులు నకిరేకంటి సైదులు మాదిగ, అబ్బాస్, పరమేష్ తదితరులు ఉన్నారు.

నివాళి..

పెద్దవూర: మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకుడు వాసుదేవుల శంకర్‌రెడ్డి మాతృమూర్తి వాసుదేవుల ఈదమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూర్ జైవీర్‌రెడ్డి బుధవారం ఊట్లపల్లి గ్రామానికి వెళ్లి ఈదమ్మ పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, నాయకులు కోట నాగిరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ సర్పంచ్ రమావత్ అశోక్, బీరెడ్డి బాల్‌రెడ్డి, వాసుదేవుల రవీందర్‌రెడ్డి, తొడిమె సుధాకర్‌రెడ్డి, సల్ల హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాలియా: పాస్టర్ ఏబీ సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుందూరు జైవీర్‌రెడ్డి